క్లుప్తంగా

6న రాజరాజేశ్వరి అమ్మవారికి పుష్పయాగం

నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి పుష్పయాగాన్ని ఈ నెల ఆరున నిర్వహించనున్నామని దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్, ఈఓ వెంకటసుబ్బయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

పీఎం విశ్వకర్మ సెలక్షన్ కమిటీ సభ్యుడిగా శ్రీనివాస్



నెల్లూరు(మినీబైపాస్): పీఎం విశ్వకర్మ యోజన సెలక్షన్ కమిటీ సభ్యుడిగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్‌ను నియమించారని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు, పీఎం విశ్వకర్మ యోజన రాష్ట్ర ఇన్‌చార్జి గోపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎమ్మెస్ఎమ్‌ఈ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ యోజనకు సంబంధించి జిల్లా సెలక్షన్ కమిటీలో 17 మంది ఉంటారని తెలిపారు. ఇందులో చైర్మన్‌గా కలెక్టర్, కన్వీనర్‌గా పరిశ్రమల కేంద్ర జిల్లా మేనేజర్ తదితర 12 మంది అధికారులు సభ్యులుగా ఉంటారని వివరించారు. వీరితో పాటు సభ్యులుగా తమ పార్టీకి చెందిన వారు ముగ్గురు ఉంటారని వివరించారు.

ఉమామహేశ్వరుడికి విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలను ఆదివారం నిర్వహించారు. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పల్లకిసేవను ప్రధానార్చకుడు రామావఝుల శ్రీనివాసులుశర్మ ఆధ్వర్యంలో జరిపారు. బాలాత్రిపుర సుందరి నృత్యనికేతన్ నాట్యాచార్యులు వేదాంతం విధుమౌళి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం అలరించింది. ఉభయకర్తలుగా చెరుకుపల్లి తిరుపాల్‌రెడ్డి, రమణమ్మ దంపతులు వ్యవహరించారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్తలు బాలాజీసింగ్, ధర్మసింగ్, ఈఓ మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

ఇది కదా.. అభివృద్ధి

నరుకూరు- టీపీగూడూరు
రహదారికి మహర్దశ

- ఆధునికీకరణకు రూ.3.75 కోట్లు మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు




శరవేగంగా జరుగుతున్న నరుకూరు-తోటపల్లిగూడూరు రోడ్డు పనులు

తోటపల్లిగూడూరు : నరుకూరు–తోటపల్లిగూడూరు ఆర్‌అండ్‌బీ రహదారి ఏడు కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉంది. నరుకూరు నుంచి పేడూరు మీదుగా తోటపల్లిగూడూరు మండల కేంద్రంతో పాటు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాటేపల్లి శివాలయం, కాటేపల్లి బీచ్, సెంబ్‌కార్ప్ పవర్ ప్లాంట్‌లతో పాటు 15 గ్రామాలకు ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగించాల్సి ఉంది. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే రహదారి పేడూరు నుంచి తోటపల్లిగూడూరు వరకు గత కొన్నేళ్లుగా అస్తవ్యస్తంగా మారిపోయింది. ముఖ్యంగా పేడూరు సమీపంలో భారీ గుంతలు ఏర్పడి వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా మారిపోయింది. వర్షాకాలం వచ్చేందంటే ఈ మార్గంలో ప్రయాణం నరకప్రాయమే. గంతలమయమైన రహదారిలో రోడ్డు ప్రమాదాలు అధికమవుతున్నాయి.

మంత్రి కాకాణి కృషితో..

రాష్ట్రంలో రహదారుల రూపురేఖలు మార్చాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గంలో రహదారుల ఆధునికీకరణపై దృష్టి సారిస్తున్నారు. ఈ క్రమంలోనే నరుకూరు- తోటపల్లిగూడూరు డబుల్ రోడ్డును బాగు చేసేందుకు నిధులు మంజూరయ్యేలా కృషి చేశారు.

జోరందుకున్న పనులు

నరుకూరు–తోటపల్లిగూడూరు డబుల్ రోడ్డు ఆధునికీకరణకు ప్రభుత్వం రూ.3.75 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులతో పేడూరు నుంచి తోటపల్లిగూడూరు వరకు 5.5 కిలోమీటర్ల మేర ఆధునికీకరణ పనులను ఇప్పటికే ప్రారంభించారు. ప్రస్తుతం పేడూరు మధ్యలో 680 మీటర్ల మేర సీసీరోడ్డును పూర్తి చేశారు. అలాగే మండల కేంద్రం సమీపంలోని పాపిరెడ్డిపాళెం డొంక రోడ్డు నుంచి ఇస్కపాళెం సెంటర్ వరకు 700 మీటర్ల మేర సీసీరోడ్డును నిర్మిస్తున్నారు. అనంతరం మిగిలిన రహదారి మొత్తం బీటీ రోడ్డు వేయనున్నారు.

స్థానికుల హర్షం

నరుకూరు–తోటపల్లిగూడూరు డబుల్ రోడ్డు ఆధునికీకరణ పనులు జోరుగా సాగుతుండడంతో స్థానిక ప్రజలు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఇబ్బందుల నడుమ ప్రయాణం సాగించడంతో పాటు వాహన ప్రమాదాలకు ఈ మార్గం కేంద్ర బిందువుగా ఉండేది. రాష్ట్ర మంత్రి కాకాణి చొరవతో ఈ రహదారి ఆధునికీకరణ పనులకు మోక్షం లభించడం సంతోషకరంగా ఉందంటూ స్థానికులు వెల్లడిస్తున్నారు.

గతంలో వానొస్తే సముద్రమే



వానొచ్చిందంటే పేడూరు నడిబొడ్డు సముద్రంగా మారిపోయేది. ప్రధాన రహదారిలో నిలిచిన నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడేవాళ్లం. ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిష్కారం లభించడం ఆనందంగా ఉంది.

– సంగారు సుహన, స్థానికురాలు, పేడూరు

కల నెరవేరింది



నరుకూరు–టీపీగూడూరు డబుల్ రోడ్డు గుంతలమయంగా మారి ఎన్నో ఏళ్లుగా ఇబ్బందుల మధ్య ప్రయాణం సాగించాల్సి వస్తుండేది. ప్రమాదకరంగా మారిన ఈ రోడ్డు ఆధునికీకరణ పనుల విషయంలో గత పాలకులు నిర్లక్ష్యం వహించారు. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆధునీకీకరించడం సంతోషంగా ఉంది.

– పాకం ప్రవీణ్‌కుమార్, స్థానికుడు, తోటపల్లిగూడూరు

పారదర్శకంగా పనులు

టీపీగూడూరు–పేడూరు రహదారి ఆధునికీకరణ పనుల్లో భాగంగా ప్రస్తుతం పేడూరు మధ్యలో 680 మీటర్ల మేర సీసీరోడ్డును పూర్తి చేశాం. పాపిరెడ్డిపాళెం డొంక రోడ్డు నుంచి ఇస్కపాళెం సెంటర్ వరకు 700 మీటర్ల మేర సీసీరోడ్డును పూర్తి చేస్తున్నాం. అనంతరం బీటీరోడ్డు పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేస్తాం. ఈ పనులను పూర్తి స్థాయిలో పారదర్శకంగా చేపడుతున్నాం.

నరేష్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, తోటపల్లిగూడూరు

డాక్టర్ మురళీకృష్ణకు పురస్కారం



పొదలకూరు (ముత్తుకూరు) : జ్యోతిష్య శాస్త్రంలో విశేష కృషి, పరిశోధన చేసినందుకు ముత్తుకూరుకు చెందిన డాక్టర్ జీవీబీ మురళీకృష్ణకు ఆదివారం 'జ్యోతిష్య బ్రహ్మ' పురస్కారం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన రుద్రాక్ష వైభవం, ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ హరిహర కళాభవన్‌లో ఈ పురస్కారం ప్రదానం చేశారు. సినీ నటుడు కాదంబరి కిరణ్, హాస్యనటుడు జెన్నీల చేతుల మీదుగా మురళీకృష్ణకు పురస్కారం అందజేశారు.

పాతబావి పూడ్చివేత



పొదలకూరు : మండలంలోని బిరదవోలు గ్రామ పొలాల్లో శివాలయానికి సమీపంలో పాతబావి పూడ్చివేత పనులు చేపట్టారు. ఇటీవల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సచివాలయ ప్రారంభోత్సవానికి విచ్చేసిన సందర్భంగా గ్రామస్తులు పాతబావి గురించి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. దీంతో బావి పూడ్చివేత పనులు వేగంగా జరుగుతున్నాయి. వెంటనే స్పందించిన మంత్రికి గ్రామస్తులు కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

- జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ



సన్మానం అందుకున్న వలంటీర్లతో అధికారులు, నాయకులు

పొదలకూరు : గ్రామ, వార్డు వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ అన్నారు. స్థానిక వూకోటి రామయ్య(శ్రామికనగర్) నగర్‌లో పొదలకూరు బిట్–2 సచివాలయ పరిధిలోని 20 మంది వలంటీర్లను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతినెలా 1వ తేదీన ఇంటింటికీ వెళ్లి తెల్లవారుజామున పింఛన్ ఇవ్వడం వలంటీర్ల సేవలకు నిదర్శనంగా పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ సోమా అరుణ మాట్లాడుతూ వలంటీర్ల సేవలను కొందరు తప్పు పడుతున్నారని, వారు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలాంటి వారన్నారు. ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, పార్టీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి వలంటీర్ల సేవలను కొనియాడారు. అనంతరం సచివాలయ పరిధిలోని వలంటీర్లను ఘనంగా సన్మానించి స్వీట్‌బాక్సులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, వూకోటి లక్ష్మీనారాయణ, సోమా భాస్కర్‌రావు, రామకృష్ణయ్య, ఎం.శివశంకర్, ఎం.శేఖర్‌బాబు, డి.విజయభాస్కర్‌రెడ్డి, జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎం.రామిరెడ్డి, టి.ప్రసాద్, వార్డుసభ్యులు ఎ.అనూరాధ, హేమంత్, జయమూర్తిరెడ్డి, ఎస్.పద్మావతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయంలో ఆదివారం జరిగిన కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజయవాడకు చెందిన మువ్వాగోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులు కామాక్షితాయి సమేత మల్లికార్జున స్వామి నృత్య నీరాజన కార్యక్రమం నిర్వహించారు. ప్రదర్శనల అనంతరం ఆలయ నిర్వాహకులు విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఈఓ గిరికృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పల్స్‌పోలియో విజయవంతం

కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామంలో ఆదివారం జరిగిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. ప్రతి మండలంలో దాదాపు 95 శాతానికిపైగా పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం పూర్తయింది. వీటితో పాటు ప్రత్యేక బృందాలు గ్రామాల్లో తిరుగుతూ వలస కూలీల పిల్లలకు సైతం పోలియో చుక్కలు వేశారు.

పొదలకూరు : మండల పరిధిలో మొత్తం 68 కేంద్రాల్లో ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. 7,706 పిల్లలు ఉన్నట్లు వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు తెలిపారు. 291 మంది సిబ్బందిని వినియోగించినట్లు చెప్పారు. తొలిరోజు వేయించుకోని వారికి రెండోరోజు ఇళ్లకు వెళ్లి వేస్తారని వివరించారు. స్థానిక బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ ప్రారంభించి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఆమె వెంట వార్డు సభ్యులు జయమూర్తిరెడ్డి, ఆకులూరు హేమంత్, బి.భారతమ్మ ఉన్నారు.

వెంకటాచలంలో 96 శాతం

వెంకటాచలం: మండలంలోని అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. కసుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిణి డాక్టర్ ప్రవల్లిక చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మండలంలో 96 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

ముత్తుకూరులో 98 శాతం

పొదలకూరు (ముత్తుకూరు) : పల్స్‌పోలియో కార్యక్రమం ముత్తుకూరు మండలంలో 98 శాతం జరిగింది. మూడు రోజుల పాటు తలపెట్టిన కార్యక్రమాన్ని ఎంపీపీ గండవరం సుగుణమ్మ ఆదివారం ప్రారంభించారు. మండలాన్ని ఏడు రూట్లుగా విభజించి, 73 బూత్‌లు ఏర్పాటు చేశారు. వైద్యాధికారి చందనప్రియ, వైద్యులు చైతన్య, పీహెచ్ఎన్ వేలాంగణి, వైద్యసిబ్బంది, ఎంపీడీఓ లక్ష్మణకుమార్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 7,544 మంది పిల్లలకుగానూ 7,366 మందికి పోలియో చుక్కలు వేశారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటి సర్వే జరిపి, మిగిలిన పిల్లలకు సైతం పోలియో చుక్కలు వేస్తామని వైద్యాధికారులు ప్రకటించారు.



ఇందుకూరుపేట : ఇటుక బట్టీ వద్ద కూలీల పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

3,300 మంది చిన్నారులకు

ఇందుకూరుపేట : మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీ పరిధిలో 2,564 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు డాక్టర్ కిశోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు తెలిపారు. మొత్తంగా మండల పరిధిలో 3,300 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ శ్రావణి, డాక్టర్ జయశంకర్ తెలియజేశారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

తోటపల్లిగూడూరు : పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నరేంద్ర తెలిపారు. కోడూరు పీహెచ్‌సీ పరిధిలో పల్స్‌పోలియో కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2,185 మంది చిన్నారులకు గానూ 2,167 మందికి పోలియో చుక్కలు వేశామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు కావల్‌రెడ్డి రంగారెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రమేష్, హెల్త్ ఎడ్యుకేటర్ ఉమర్, ఆరోగ్య కార్యకర్త జీవకుమారి పాల్గొన్నారు.

మనుబోలులో 97 శాతం

మనుబోలు : మండల పరిధిలో పల్స్‌పోలియో కార్యక్రమం తొలిరోజు 97 శాతం పూర్తయినట్లు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రాజయ్య తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ గేయ పూజిత, డాక్టర్ మోహిసినా సుల్తానా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఐదేళ్లలోపు చిన్నారులు 4,568 మంది ఉండగా 4,437 మందికి పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. ఇందుకోసం మండలంలో 40 బూత్‌లు, ఒక మొబైల్ బూత్‌ను ఏర్పాటు చేశామని, 45 మంది సిబ్బంది పోలియో చుక్కలు వేశారని తెలిపారు. కార్యక్రమంలో హోమియో డాక్టర్ శిరీష, హెల్త్ సూపర్‌వైజర్లు హైమావతి, వెంకట రమణయ్య, హెల్త్ అసిస్టెంట్‌లు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, మురళీకృష్ణ, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నగర పంచాయతీ పరిధిలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని సీహెచ్‌సీలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పాల్గొని, మాట్లాడారు. చిన్నారుల ఆరోగ్యానికి పోలియో చుక్కలు వేయించడం అవసరమన్నారు. వైద్య సిబ్బంది పట్టణంలోని ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వవ్వేరు కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సతీష్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కోవూరు : పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కొడవలూరు మండలంలోని నార్తురాజుపాళెంలో ఆదివారం జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని, ఈ మేరకు తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు.



నార్తురాజుపాళెంలో వైద్యారోగ్య సిబ్బందితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



పొదలకూరు : చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీటీసీ నిర్మలమ్మ



వెంకటాచలం పీహెచ్‌సీలో..



ముత్తుకూరు : పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ సుగుణమ్మ



తోటపల్లిగూడూరు : కోడూరు పీహెచ్‌సీలో..



మనుబోలు : పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ గేయ పూజిత



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది



మనుబోలు : ఇటుక బట్టీల వద్ద చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



మంత్రి కాకాణి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన చెముడుగుంట గ్రామస్తులు

- ఒకేరోజు టీడీపీని వీడిన 200 కుటుంబాలు
- సోమిరెడ్డికి గట్టి ఎదురుదెబ్బ

వెంకటాచలం : ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీ రోజురోజుకు బలహీన పడుతోంది. ముఖ్యంగా వెంకటాచలం మండలంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. చంద్రబాబు తన జిల్లా పర్యటనలో భాగంగా వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి భారీ వలసలంటూ ప్రకటించుకున్న 24 గంటల్లోనే సర్వేపల్లి నియోజకవర్గంలో టీడీపీకి గట్టి షాక్ తగిలింది. వెంకటాచలం మండలంలోని చెముడుగుంట గ్రామంలో 200 కుటుంబాలు ఆదివారం టీడీపీకి గుడ్‌బై చెప్పి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరు నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో కలిశారు. తామంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరేందుకు వచ్చామన్నారు. దీంతో వారిని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించి కండువాలు కప్పారు. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల కాలంలో చెముడుగుంట గ్రామం ఎంతో అభివృద్ధి చెందింది. సీసీరోడ్లు, డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి పనులతో పాటు అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతో ప్రజలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి వచ్చేందుకు ఆసక్తి చూపారు. అందులో భాగంగా ఇప్పటివరకు చెముడుగుంట గ్రామంలో 400 కుటుంబాలకు పైగా టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరడంతో టీడీపీకి గట్టి ఎదురు దెబ్బ తగిలినట్లు అయ్యింది.



పొదలకూరు : పార్టీలో చేరిన వారితో మంత్రి కాకాణి

జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరిక

పొదలకూరు : పట్టణానికి చెందిన 20 మంది జనసేన కార్యకర్తలు గంగవరపు వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. బూత్ కమిటీ అధ్యక్షుల సమావేశానికి హాజరైన మంత్రి కాకాణిని కలిసిన వారు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. యువకుల సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీలోకి రావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, వైస్ ఎంపీపీ సోమా అరుణ, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీలు జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ



పొదలకూరు : జగనన్న కాలనీల్లో ఇంటి నివేశన స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను లబ్ధిదారులకు ఆదివారం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలంలోని జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులకు అందజేసిన ప్లాట్లను సచివాలయాల పరిధిలో రిజిస్ట్రేషన్ చేసి శాశ్వత హక్కులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకురాలు కోడూరు కల్పలతారెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అరుణ, పార్టీ నేతలు పెదమల్లు రమణారెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి, జి.వేణుగోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ నిర్మలమ్మ, ఎమ్పీటీసీలు జి.శ్రీనివాసులురెడ్డి, జి.లక్ష్మీకల్యాణి, బి.భారతమ్మ పాల్గొన్నారు.